నమస్తే తెలంగాణ
ఖమ్మం
10 | ఖమ్మం, బుధవారం 2 ఏప్రిల్ 2025 | KHAMMAM

విమానాశ్రయ ఏర్పాటును వేగవంతం చేయండి

కేంద్రమంత్రిని కోరిన ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, ఏప్రిల్ 1: పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేష్‌రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, విప్ దీవకొండ దామోదర్‌రావు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి భేటీ అయ్యారు. మంగళవారం పార్లమెంట్ ప్రాంగణంలోని కేంద్ర మంత్రి చాంబర్‌లో ఎంపీలు ఆయనతో సమావేశమై తెలంగాణలో విమానాశ్రయాల ఏర్పాటుపై చర్చించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి సమీపాన ప్రతిపాదిత విమానాశ్రయం ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేయాల్సిందిగా మంత్రిని కోరారు. సింగరేణి సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు నవభారత్, ఐటీసీ, మణుగూరు హెవీ వాటర్‌ప్లాంట్ సహా పలు పరిశ్రమలు నెలకొన్నాయని, దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చిపోయే భక్తులకు ఇక్కడ ఏర్పాటు చేసే విమానాశ్రయం సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు.

హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలి

హెచ్‌సీయూ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీకి చెందిన 400ఎకరాల భూమిని వేలం వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ఆ భూముల్లో చెరువులతోపాటు అరుదైన వృక్ష సంపద, జింకలు, నెమళ్లు, పక్షులు ఉన్నాయని వివరించారు.


కేంద్రమంత్రితో ఎంపీ వద్దిరాజు, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు

మణుగూరులో పోలీసులకు ఫిర్యాదు అందిస్తున్న రేగా, బీఆర్ఎస్ నేతలు

హామీలు అమలు చేసేదాకా నిద్రపోనివ్వం..

- ఆరు గ్యారెంటీలు ఎక్కడ?
- మాట తప్పిన కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా
- హామీల అమలులో ప్రజలకు మొండి'చేయి'
- మాజీ మంత్రి వనమా
- కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. పీడించే పాలన
- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్
- సీఎం, డిప్యూటీ సీఎంపై చీటింగ్ కేసులు పెట్టాలి
- పోలీస్‌స్టేషన్లలో రేవంత్, భట్టిపై ఫిర్యాదుల వెల్లువ
- భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, మంత్రులను నిద్రపోనియ్యమని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. వందరోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలు ఎటు పోయాయని నిలదీశారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా హామీల అమలులో జాప్యం ఎందుకని మండిపడ్డారు. ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీ పథకాలపై సంతకాలు చేసి రాష్ట్ర ప్రజానీకాన్ని మోసం చేసినందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళ వారం ఆ పార్టీ పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో రేవంత్, భట్టిపై ఫిర్యాదులు అందజేశారు. జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు చేశారు.. వినూత్నంగా నిరసనలు తెలిపారు. 'ఓడ ఎక్కేదాక ఓడ మల్లయ్య.. ఏరు దాటాక బోడ మల్లయ్య' అన్నట్లు ఉందని కాంగ్రెస్ సర్కార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపక్షాన నిరంతరం పోరాడుతామని పేర్కొంటూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎక్కడికక్కడ ఎండగట్టారు.

–మణుగూరు టౌన్/ కొత్తగూడెం అర్బన్/ ఇల్లెందు, ఏప్రిల్ 1

అశ్వారావుపేటలో..

భద్రాచలంలో..

చర్లలో..

కరకగూడెంలో..

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క్‌పై చీటింగ్ కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో ఫిర్యాదు అందజేశారు. పార్టీ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అమలుకాని ఆరు గ్యారెంటీ కార్డుల మీద సంతకాలు పెట్టి వంద రోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పి 15 నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రజల్ని మోసం చేసిన సీఎం, డిప్యూటీ సీఎంపై చీటింగ్ కేసు నమోదు చేయాలన్నారు. కొత్తగూడెం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఫిర్యాదు అందజేశారు. వనమా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కొత్తగూడెంలో ర్యాలీ చేసి కళ్లకు గంతలు కట్టుకొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఇల్లెందులో మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, బీఆర్ఎస్ సీనియర్ నేత దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి ఇల్లెందు పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేశారు. సీఎం, డిప్యూటీ సీఎంపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు అందజేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని సీఎం, డిప్యూటీ సీఎంపై కేసు నమోదు చేయాలని ఎస్సై సందీప్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమల్లో ఆయా మండలాల్లో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇల్లెందులో పోలీసులకు ఫిర్యాదు అందిస్తున్న హరిప్రియ, దిండిగాల

కొత్తగూడెంలో ఫిర్యాదు అందిస్తున్న వనమా

చండ్రుగొండలో పోలీసులకు ఫిర్యాదు ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు

జిల్లాలో రేపు నిరసనలు, ధర్నాలు

హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలి: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా

మణుగూరు టౌన్, ఏప్రిల్ 1: హెచ్‌సీయూ భూముల వేలం ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉదయం 11 గంటలకు ప్రతీ మండల కేంద్రంలో నిరసనలు, ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

విధుల్లో అలసత్వం వహించొద్దు

శ్రీరామనవమి ఏర్పాట్ల పరిశీలనలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్

ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్

భద్రాచలం, ఏప్రిల్ 1 : భద్రాచలంలో శ్రీరామనవమి విధులు నిర్వర్తించే అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం వహించొద్దని, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ అధికారులకు సూచించారు. భద్రాచలంలో ఈ నెల 6న జరిగే శ్రీరామనవమి, మహా పట్టాభిషేకం ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. మిథిలా స్టేడియంలో శ్రీరామనవమి ఏర్పాట్లతోపాటు పరిసర ప్రాంతాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చేపడుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. చలువ పందిళ్లు, వీఐపీ, వీవీఐపీ సెక్టార్లను పరిశీలించి భక్తులకు అందాల్సిన ప్రసాదాలు, తలంబ్రాలు తదితరాలపై అధికారులతో మాట్లాడారు.

భక్తుల కోసం ఫాగ్ మీస్ట్: కలెక్టర్ జితేశ్

శ్రీరామనవమి, పట్టాభిషేకం వేడుకలకు హాజరయ్యే భక్తులు, పర్యాటకుల కోసం తొలిసారిగా ఫాగ్ మీస్ట్ (మంచు తుంపర్లు) ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. మంగళవారం ఆయన ఈవో రమాదేవి, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్‌తో కలిసి కల్యాణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రాహుల్, ఆర్డీవో దామోదరరావు, తహసీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ ఈవో శ్రీనివాస్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ రికార్డుల పరంపర

- అధిక ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) సాధించిన ఏడో దశ యూనిట్
- దేశంలోనే మూడో స్థానంలో నిలిచి రికార్డు నెలకొల్పిన కర్మాగారం

కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారం

పాల్వంచ, ఏప్రిల్ 1 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారం రికార్డుల పరంపర కొనసాగిస్తున్నది. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్ రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలన్నింట్లోనూ ఈ ఏడాది 79.04 పీఎల్ఎఫ్(ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్)తో రాష్ట్రంలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. యూనిట్‌లో ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరాటంకంగా 112 రోజులపాటు విద్యుత్ ఉత్పత్తి చేసి రికార్డు నెలకొల్పింది. 2019లో యూనిట్ ప్రారంభించిన నాటి నుంచి తన సామర్థ్యాన్ని నిలబెట్టుకుంటూ ముందుకెళ్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2019లో యూనిట్ నిర్మాణం పూర్తియినప్పటి నుంచి అత్యధిక పీఎల్ఎఫ్ సాధించి దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. కేటీపీఎస్‌లోని 5వ దశ 9వ యూనిట్‌లో 73.29 పీఎల్ఎఫ్, 10వ యూనిట్‌లో 58.47 పీఎల్ఎఫ్, 6వ దశలోని 11వ యూనిట్‌లో 69.74 పీఎల్ఎఫ్ సాధించగా.. రాష్ట్రంలోని భూపాలపల్లి కేటీపీపీ మొదటి దశ 500 మెగావాట్లలో 67.60 పీఎల్ఎఫ్, 2వ యూనిట్‌లో 66.26 పీఎల్ఎఫ్, మణుగూరులోని భద్రాద్రి పవర్ ప్లాంట్ 200 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లలో మొదటి యూనిట్ 18.49, రెండో యూనిట్‌లో 72.54 పీఎల్ఎఫ్, 3వ యూనిట్‌లో 70.51, నాల్గవ యూనిట్‌లో 63.93 పీఎల్ఎఫ్ సాధించాయి. నల్లగొండ జిల్లా యాద్రాద్రిలోని ఒకటో యూనిట్‌లో సీవోడీ అయి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించి నిలిపివేశారు. 2వ యూనిట్ 21.18 మెగావాట్ల పీఎల్ఎఫ్ సాధించింది. ఓవరాల్‌గా రాష్ట్రంలోని అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలను పరిశీలిస్తే.. కేటీపీఎస్ ఏడో దశ రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి సాధించి తన ప్రత్యేకతను చాటుకుంది. ఈ యూనిట్ మొదట్లో పనికిరాదని అపోహలు సృష్టించినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్రానికి వెలుగులు అందించడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

'స్పాట్' సజావుగా సాగేనా!

- టీచర్ల గైర్హాజరు, షోకాజ్‌ల ఇబ్బందులు ఈసారైనా తొలగేనా?
- ఎంపికైన ఉపాధ్యాయులకు ఇప్పటికే చేరిన వాల్యుయేషన్ ఉత్తర్వులు
- ఖమ్మం 'సెయింట్ జోసెఫ్'లో 7 నుంచి 16 వరకు 'మూల్యాంకనం'

పదో తరగతి ప్రశ్నపత్రాల మూల్యాంకనంలో ఉపాధ్యాయుల విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులు ఈసారైనా తొలగిపోతాయా? లేక 'యథావిధే' అన్నట్లుగా ఉంటాయా? అనే అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే.. టెన్త్ ప్రశ్నపత్రాల వాల్యుయేషన్‌కు హాజరుకావాలటూ సంబంధిత ఉపాధ్యాయులకు విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు ఇవ్వడం, ఉపాధ్యాయులు హాజరుకాకపోవడం, షోకాజ్ నోటీసులు ఇస్తామంటూ అధికారులు హెచ్చరించడం, రిపోర్ట్ చేయని ఉపాధ్యాయులను రప్పించేందుకు చర్యలు తీసుకోవడం వంటి అంశాలు.. ఖమ్మం జిల్లాలో జరిగే టెన్త్ స్పాట్‌లో ఏటా కన్పిస్తూనే ఉన్నాయి. మరి ఈ ఏడాది ఇలాంటి ఇబ్బందులను అధిగమించేందుకు సంబంధిత అధికారులు తమ ప్రణాళికలో భాగంగా ఉత్తర్వులు అందించినప్పటికీ సదరు ఉపాధ్యాయుల్లో ఎంతమంది గైర్హాజరవుతారనే అంశంపై సందిగ్ధం నెలకొంది.

– ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 1

టెన్త్ ప్రశ్నపత్రాల మూల్యాంకన ప్రక్రియలో పాల్గొనే ఉపాధ్యాయులకు పదో తరగతి సబ్జెక్టులు, భాషల బోధనలో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. అయితే, ఇటీవల అధిక సంఖ్యలో ఉద్యోగ విరమణలు జరుగుతున్నందున పరీక్షల విభాగం అధికారులు అందుకు అవసరమైన స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. అత్యంత క్రియాశీలకమైన స్పాట్ ప్రక్రియకు కొందరు ఉపాధ్యాయులు కనీస సమాచారం ఇవ్వకుండా గైర్హాజరవుతుంటారు. మరికొందరు ఏ విధమైన సర్దుబాట్లూ చేసుకోరు. ఇంకొందరు అనారోగ్య కారణాలు చూపుతూ మూల్యాంకన బాధ్యతల నుంచి తప్పించుకుంటుంటారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7 నుంచి ప్రారంభమయ్యే స్పాట్ ప్రక్రియ సజావుగా సాగుతుందో లేదోననే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధ్యాయులకు చేరిన ఉత్తర్వులు

మూల్యాంకనం కోసం తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితంతోపాటు భౌతిక, రసాయన, జీవ, సాంఘిక శాస్త్రాల సబ్జెక్టులు, భాషల వారీగా స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్లను అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా నియమించారు. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ)లను స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించారు. ఈ నెల 1 నాటికి ఎంఈవోలు, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా స్పాట్ ఉత్తర్వులను సదరు ఉపాధ్యాయులకు అందజేశారు. మూడేళ్ల అనుభవం నిబంధన రీత్యా.. ఇటీవల పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్లకు, నూతనంగా చేరిన స్కూల్ అసిస్టెంట్లకు ఏఈలుగా అవకాశం కల్పించలేదు. అయితే, ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు ఈ నెల 4న సంబంధిత పాఠశాలల్లో రిలీవ్ అయి 7న స్పాట్ కేంద్రంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను పరీక్షల విభాగం ఏసీ రమేశ్, సీనియర్ అసిస్టెంట్ యూసఫ్ పర్యవేక్షిస్తున్నారు.

ఏసీవోలు, సీఈలుగా ప్రధానోపాధ్యాయులు

స్పాట్ ప్రక్రియలో క్యాంపు ఆఫీసర్‌గా డీఈవో విధులు నిర్వర్తిస్తారు. అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు(ఏసీవో)గా ఎంఈవోలతో పాటు సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఎంపిక చేశారు. చీఫ్ ఎగ్జామినర్లు(సీఈ)గా ప్రధానోపాధ్యాయులు విధులు నిర్వర్తించనున్నారు. ఏఈలుగా స్కూల్ అసిస్టెంట్లను, స్పెషల్ అసిస్టెంట్లుగా ఎస్‌జీటీలను నియమించారు. మొత్తంగా ఈ మూల్యాంకన ప్రక్రియ కోసం సీఈలుగా 109 మందిని, ఏఈలుగా 648 మందిని, స్పెషల్ అసిస్టెంట్లుగా 218 మందిని నియమించారు. మొత్తం ఈ 975 మందికి విద్యాశాఖ పరీక్షల విభాగం అధికారులు ఇప్పటికే ఉత్తర్వులు అందజేశారు. స్పాట్‌లో పాల్గొనే ఉపాధ్యాయులకు రోజుకు 46 సమాధాన పత్రాలను మాత్రమే వాల్యుయేషన్ కోసం ఇవ్వనున్నారు. ఉదయం సమయంలో 20 పేపర్లు, మధ్యాహ్నం సమయంలో 26 పేపర్లు వాల్యుయేషన్ చేయాల్సి ఉంటుంది.

'సెయింట్ జోసెఫ్'లో స్పాట్ ప్రక్రియ

ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్లో స్పాట్ కేంద్రాన్ని నిర్వహించనున్నారు. ఈ నెల 7 నుంచి 16 వరకు 9 రోజులపాటు మూల్యాంకన ప్రక్రియ కొనసాగుతుంది. స్పాట్ కోసం ఇప్పటివరకు 70 వేల పేపర్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఎప్పటికప్పుడు వచ్చిన సమాధాన పత్రాలను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరుస్తుంటారు. క్యాంపు ఆఫీసర్ (డీఈవో) పర్యవేక్షణలో పరీక్షల విభాగం అధికారులు, సిబ్బంది ఈ ప్రక్రియను సమన్వయం చేస్తుంటారు. ఎప్పటికప్పుడు ఉన్న తాధికారులకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

మధిర, కూసుమంచి, భద్రాచలం స్టేషన్లలో పోలీసుల అదుపులో ఉన్న సీపీఎం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్ నాయకులు

ఉమ్మడి జిల్లాలో ముందస్తు అరెస్టులు

- 'చలో హైదరాబాద్'కు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు
- హెచ్‌సీయూ భూముల్ని విక్రయించొద్దు: పార్టీలు, సంఘాల డిమాండ్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి చెందిన 400 ఎకరాల భూములను ప్రభుత్వం ఆక్రమించుకుని వేలం వేసేందుకు యత్నిస్తుండగా అడ్డుకునేందుకు చలో హైదరాబాద్ కార్యక్రమానికి వివిధ సంఘాలు, పార్టీల పిలుపు మేరకు తరలివెళ్తున్న బీఆర్ఎస్వీ, సీపీఎం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు మంగళవారం ఎక్కడికక్కడ అడ్డుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కూసుమంచిలో సీపీఎం నేతలు తోటకూరి రాజశేఖర్, ఎడవల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్, చీర్ల రాధాకృష్ణలను, పాల్వంచలో బీఆర్ఎస్వీ నేతలు బత్తుల మధుచందర్, జూపల్లి దుర్గాప్రసాద్‌లను, ములకలపల్లిలో డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు నిమ్మల మధు, అనుముల సాయి, సాయిచరణ్, పండా రాంచరణ్, కీసరి స్వాతి, సూర్యలను, మధిరలో సీపీఎం నాయకులు శీలం నరసింహారావు, పాపినేని రామనర్సయ్య, పడకంటి మురళి, వడ్డానపు మధులను, సత్తుపల్లిలో సీపీఎం నేతలు కొలికపోగు సర్వేశ్వరరావు, జాజిరి శ్రీనివాస్, రావుల రాజబాబు, చప్పిడి భాస్కర్‌లను, ఎర్రుపాలెంలో డీవైఎఫ్ఐ నేత మద్దాల ప్రభాకర్‌రావును, ఇల్లెందులో బీఆర్ఎస్వీ నాయకులు గిన్నారపు రాజేశ్, హరిప్రసాద్, చాంద్‌పాషా, పీడీఎస్‌యూ నాయకులు పృథ్వీ, సాంబ, పార్థసారథిలను, భద్రాచలంలో బీఆర్ఎస్వీ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు కీసరి యువరాజు, మునగాల శివ, కొల్లిపాక శివ, ప్రశాంత్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రఘునాథపాలెం మండలం చిమ్మపూడిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పార్టీలు, సంఘాల నాయకులు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని స్పష్టం చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాలు తప్పవని తేల్చిచెప్పారు. హెచ్‌సీయూ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ కొత్తగూడెంలో బీఆర్ఎస్ నేతలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.

–నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 1

కొత్తగూడెంలో కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మంలో..

ములకలపల్లిలో..

ఇల్లెందులో..

సత్తుపల్లిలో..

రఘునాథపాలెంలో..